శ్రీశైలంలో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహణపై ఈవోతో మాట్లాడుతున్న ఆక్టోపస్ బృందం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు. శుక్రవారం క్యూకాంప్లెక్స్, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా పరంగా చేపట్టవలసిన పలు చర్యలపై ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆక్టోపస్ బృందంతో సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రతకు సంబంధించిన అంశాలు, క్యూలైన్ల నిర్వహణ, ఉత్సవాల్లో దర్శనం చేసుకుంటున్న భక్తుల సంఖ్య తదితర అంశాలపై డీఎస్పీ సుంకురయ్య, సీఐ ప్రసాదరావు, దేవస్థానం భద్రతా విభాగం పర్యవేక్షకులు మల్లికార్జున తదితరులు పాల్గొని చర్చించారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

- నీట మునిగిన పంటలు
- స్తంభించిన రాకపోకలు



పీరుసాహెబ్ పేట గ్రామంలో నీట మునిగిన మొక్కజొన్న పంట

మిడుతూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈనేపథ్యంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో, చెరుకుచెర్ల, తలముడిపి, చౌట్కూరు గ్రామాల్లో అధిక వర్షాల కారణంగా వంతెనలు ఎక్కి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. మిడుతూరులోని కాకిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా పంటలు నీట మునిగాయి.

నిధులు సిద్ధంగా ఉన్నా రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. రాజకీయ కారణాల వల్ల పనులు పూర్తి కాలేదు. దీంతో సుమారు ఐదేళ్లుగా రూ.13.40కోట్ల నిధులు మురిగి పోతున్నాయి. ప్రత్యామ్నాయం చూపడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే బొమ్మలసత్రం - నూనెపల్లె రోడ్డు దుస్థితి ఇది.. పనులు ఎప్పుడు పూర్తవుతాయా.. అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



పనులు ప్రారంభించని బొగ్గులైన్ రోడ్డు

నిధులున్నా నిర్లక్ష్యమే..!

- ఓటు బ్యాంకు కోసం ఆగిన రహదారి నిర్మాణం
- ఐదేళ్లనుంచి మురిగిపోతున్న రూ.13.40 కోట్లు
- వైసీపీ హయాంలో పట్టించుకోని వైనం
- ప్రత్యామ్నాయం చూపడంలో అధికారుల విఫలం

నంద్యాల హస్పిటల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన తర్వాత కలెక్టర్ కార్యాలయానికి బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె వరకు రోడ్డును వెడల్పుచేసి సుందరీకరణ చేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. అప్పటి కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ కలెక్టరేట్ ముందు రహదారి విస్తీర్ణం చేయించారు. కొంతమేరకే పనులు చేసి వదిలేశారు. నూనెపల్లె బ్రిడ్జి నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు అప్పట్లో ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేశారు. ఆర్ఏఆర్ఎస్ నుంచి బొగ్గులైన్ మీదుగా బొమ్మలసత్రం వరకు రోడ్డు విస్తరణ పనులు రాజకీయ పరిణామాల మధ్య నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇద్దరు నాయకుల మధ్య ఓటుబ్యాంకు కోసం పనులను నిలిపివేసినట్లు తెలుస్తోంది. అధికారులు బొగ్గులైన్‌లో ఆక్రమణదారులకు పలుదఫాలుగా నోటీసులిచ్చినా ఫలితం లేకపోయింది. దాదాపు 30 ఏళ్లనుంచి బొగ్గులైన్ వాసులు రోడ్డుకిరువైపులా షెడ్లు, భవనాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ప్రమాదమని తెలిసినా అక్కడే జీవనం సాగిస్తున్నారు. వేరే ప్రాంతాలనుంచి వలసలు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2020 ఆగస్టులో 60 అడుగుల రోడ్డు నిర్మాణం, ఫుట్‌పాత్, డ్రైన్స్ నిర్మాణానికి రూ.13.40కోట్లు మంజూరు చేసింది. 2022లో పనులు పూర్తిచేయాల్సి ఉండగా కేవలం కొంతదూరం మాత్రమే డ్రైన్లు వేసి మమ అనిపించారు. ఇందుకుగాను దాదాపు రూ.40 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. 2.5 కి.మీ. రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఐదేళ్ల నుంచి పనులు చేపట్టకపోవడంతో నిధులు మురిగిపోతున్నాయి.

స్థలం ఇస్తే స్వచ్ఛందంగా వెళ్తా



30 సంవత్సరాల నుంచి బొగ్గులైన్‌లో నివాసం ఉంటున్నాం. గత ప్రభుత్వంలో ఇళ్లపట్టాలు ఇవ్వలేదు. పింఛన్‌తో బతుకుతున్నాం. టిడ్కో భవనాల్లో 2వ అంతస్తులో ఇస్తామన్న అధికారులు భవనం చూపలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నాం. ఇంటి స్థలం ఇస్తే స్వచ్ఛందంగా వెళ్తాం.

\- ఉసేన్‌బీ

త్వరలో ప్రారంభిస్తాం



గతంలో మంజూరైన నిధులు రద్దు కాలేదు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం. 60 అడుగుల వెడల్పు, ఫుట్‌పాత్, డ్రైన్లు, డివైడర్ వంటి పనులు చేయాల్సి ఉంది. టెండర్ విషయమై ఉన్నతాధికారులతో చర్చించాల్సి ఉంది. ప్రభుత్వ అనుమతితో వెంటనే రోడ్డు పనులు పూర్తి చేస్తాం.


● శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు చూపలేదు



గతంలో రెండుసార్లు పట్టాలు ఇచ్చారేకాని స్థలాలు చూపలేదు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. రోడ్డు ప్రమాదంలో భుజం గాయమై పనికి వెళ్లలేక బంకు పెట్టుకొని జీవనం సాగిస్తున్నా. ఇప్పటికైనా ఇంటిస్థలం ఇస్తే ఇల్లు కట్టుకుంటాం.

\- మాబున్ని



వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీ

ఇళ్లను కూలదోసేందుకు అధికారులు పలుమార్లు ప్రయత్నించినా బొగ్గులైన్ వాసులు అడ్డుపడటంతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లు కూలదోసే సమయంలో అప్పట్లో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ కాలనీకి చేరుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయించిన తర్వాతే ఖాళీ చేయించాలని అధికారులను కోరారు. ఉన్నట్టుండి ఖాళీ చేయిస్తే నిరాశ్రయులవుతారనే ఉద్దేశంతో అప్పటి కలెక్టర్ బొగ్గులైన్ వాసులకు ప్రత్యామ్నాయంగా కుందూనది పక్కన సెంటు స్థలం, కొందరికి టిడ్కో భవనాల్లో నివాసాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో అధికారులు కుందూనది పక్కన హడావుడిగా కాలనీ ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించి గ్రావెల్ రోడ్డువేసి బొగ్గులైన్ వాసులకు ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. ఆ కాలనీలో నిర్మాణాలు ఆగిపోయాయి. కొందరు కుందూ నీరు వస్తే మునిగిపోతామనే భయంతో నిర్మాణాలు చేపట్టలేదు. రాత్రివేళలో బొగ్గులైన్‌లో రోడ్డును ఆనుకొని నిద్రిస్తుండగా రోడ్డు ప్రమాదాలు జరిగి చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో బొగ్గులైన్ వాసులకు ప్రత్యామ్నాయంగా ఇళ్లస్థలాలు చూపిస్తారని గంపెడాశతో ఉన్నారు. కాగా 1992లో, 2007లో బొగ్గులైన్ వాసులకు పట్టాలిచ్చారేకాని స్థలాలు చూపలేదు. సర్వేనెంబర్ 284లో ఇళ్లపట్టాలు 2007లో ఇచ్చారు. స్థలాలు చూపకపోవడంతో లబ్ధిదారులు ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఉపయోగంలేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అయినా బొగ్గులైన్‌వాసులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి రహదారి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం

కలెక్టర్ రాజకుమారి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. పట్టణంలోని పీజీఆర్ఎస్ కంట్రోల్ రూమ్‌లో శుక్రవారం పీజీఆర్ఎస్ అర్జీలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు 41,247 అర్జీలు స్వీకరించగా అందులో 38,862 సమస్యలు పరిష్కారమైనట్లు తెలిపారు. మిగతా వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేలా అధికారులను ఆదేశించామన్నారు. ఫిర్యాదులపై సరైన సమాధానాలు ఇవ్వని గ్రామ, మండల, జిల్లాస్థాయిలో ఉన్న 230 మంది అధికారులకు మెమోలు జారీ చేశామని చెప్పారు. 13,403 ఫిర్యాదులను ఉన్నతాధికారులు రీ ఓపెన్ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని కోరారు.

ఆక్రమణలకు తావివ్వొద్దు

- సోలార్ భూములను పరిశీలించిన జేసీ



కందికాయపల్లి సోలార్ భూముల రికార్డును పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

పాణ్యం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సోలార్ పరిశ్రమలో భాగంగా చేపట్టిన ప్రభుత్వ భూముల ఆక్రమణలకు తావివ్వకూడదని జాయింట్ కలెక్టరు విష్ణు చరణ్ ఆదేశించారు. కందికాయపల్లిలోని సోలార్ భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించి గతంలో కేటాయించిన భూముల వివరాలను తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణకు గురైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు, వీఆర్వో, సర్వేయర్లకు సూచించారు. సర్వే నెంబర్ల వారిగా కేటాయించిన భూముల మ్యాపులను పరిశీలించి సూచనలిచ్చారు. ఆయన వెంట ఆర్డీవో విశ్వనాథ్, ఆర్ఐ రాము, వీఆర్వో సిద్ధయ్య, సర్వేయర్ నాగరాజు ఉన్నారు.

శ్రీశైలంలో 9 గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయరులో వరదనీరు వచ్చి చేరుతుండంతో 9 క్రస్టు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,38,626 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల స్పిల్‌వే నుంచి 1,23,768 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం 33,403 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు మొత్తం 1,77,367 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యామ్ నీటి మట్టం 851.60 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 197.0114 టీఎంసీలుగా నమోదు అయింది. శ్రీశైలంలో కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం 30,522 క్యూసెక్కులు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం 30,315 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.



తొమ్మిది గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

కోలాహలంగా గణేశ్ ఉత్సవాలు

6లో



పాములపాడులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



- హంద్రీ కబ్జాలు తొలిగేనా?
- మూడు జోన్లుగా నదీతీరాలు
- రక్షిత, నియంత్రిక, హెచ్చరిక జోన్లుగా గుర్తింపు
- నదులకు 100మీటర్ల వరకు 'నో డెవలప్‌మెంట్ జోన్'
- మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

కర్నూలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం మధ్య లో 5.40 కిలోమీటర్లు హంద్రీ నది ప్రవహిస్తుంది. నదీతీరం ఇరువైపుల ఆక్రమణలకు గురైంది. గరిష్ఠ వరద ప్రవాహ అంచుల (మ్యాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్-ఎంఎఫ్ఎల్) నుంచి 50 మీటర్లు (150 అడుగులు) వరకు బఫర్ జోన్‌గా, వక్కెరు వాగు తీరం వెడల్పు (బఫర్ జోన్) 30-50 అడుగుల వరకు ఉంటుందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. స్థిరాస్తుల విలువ భారీగా పెరగడంతో హంద్రీ, వక్కెరు వాగు సహా నగరం అంచున ప్రవహించే తుంగభద్ర మునగాలపాడు నుంచి జోహరాపురం వరకు నదీతీరాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో దర్జాగా కబ్జా చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో నిబంధనలు తుంగలో తొక్కేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు వెంచర్లు వేయడం, ఇళ్ల నిర్మాణాలు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశాల మేరకు రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి హంద్రీ నది కుడిగట్టు వెంబడి 164, ఎడమ గట్టు వెంబడి 174 ఆక్రమణలు గుర్తించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు హంద్రీ సరిహద్దులు గుర్తించి.. సరిహద్దు సిమెంట్ పిల్లర్లు పాతారే తప్పా ఆక్రమణల జోలికి వెళ్లలేదు. దీంతో కొత్తగా భవనాలు నిర్మించిన బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

మళ్లీ వరదొస్తే..

హంద్రీ నదికి 1997లో ఆగస్టు, సెప్టెంబరులో రెండు సార్లు లక్ష క్యూసెక్కులకు పైగా వరదొచ్చి నదీతీరంలో కాలనీలు ముంపునకు గురయ్యాయి. 2007లో ఏకంగా 2లక్షల క్యూసెక్కులు వరద రావడంతో కల్లూరు దగ్గర ఉన్న హైవే నుంచి జోహరాపురం వరకు విఠల్ నగర్ సహా వివిధ కాలనీలు ముంపునకు గురై ఊహించని నష్టం చవిచూశారు. 2009లో ఏకంగా 3లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావడంతో నదీతీరం అంచులపై ఏకంగా ఆరేడు అడుగుల ఎత్తులో వరద ప్రవహించిందని ఇంజనీర్లు గుర్తు చేస్తున్నారు. పగటి పూట వరద రావడంతో ఆస్తి నష్టం తప్పా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, అదే రాత్రి వరదొచ్చి ఉంటే ఊహించుకోవడానికి భయమేస్తుందని నాడు వరద సహాయక చర్యల్లో పాల్గొన్న ఇంజనీరు ఒకరు పేర్కొన్నారు.




సరిహద్దు పిల్లర్లు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది (ఫైల్)

రక్షణ గోడ నిర్మాణం కోసం..

హంద్రీ నదీతీరం జోహరాపురం నుంచి వందిపాడు వరకు, తుంగభద్ర తీరం కుడిగుట్టు జోహరాపురం నుంచి మునగాలపాడు సమీపంలోని హైవే వరకు, వక్కెరు వాగు ఆనంద్ సినీ థియేటర్ నుంచి రేడియోస్టేషన్ వరకు, సుద్దవాగు సి.క్యాంప్ సర్కిల్ నుంచి జోహరాపురం వరకు రక్షణ గోడ నిర్మాణం కోసం రూ.220 కోట్లు నిధులు కేటాయించి టెండర్లు పిలిచారు. పనులు చేయకపోవడంతో ఆటెండర్లు రద్దుచేశారు. ఐదారు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. అదే జరిగితే ప్రతి వర్షపు చుక్క వంకలు, వాగుల ద్వారా హంద్రీ నదికి చేరే అవకాశం లేకపోలేదు. మళ్లీ వరదొస్తే? నదీతీర కాలనీలకు రక్షణ ఏదీ? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

మిగతా 7వ పేజీలో



హంద్రీ నదీతీరం బఫర్ జోన్‌లో నిర్మాణాలు

ఇక వెళ్లొస్తా..



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

పూరి గణనాథుడు



కర్నూలు వన్‌టౌన్‌లో..

విద్యా వినాయక



ఆదోని: అవ్వ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు

గురుడ గణపయ్య




త్రిముఖ.. త్రిశూలధారుడై



కర్నూలు పూలబజార్‌లో కొలువైన వినాయకులు

వీణాపాణిగా..



ఆదోని కొత్త బస్టాండ్‌కి వెళ్లే రహదారిలోని మండగిరి యూత్ ఏర్పాటు చేసిన వీణ వాయిస్తూ కొలువుదీరిన గణపయ్య

కోలాహలంగా గణేశ్ ఉత్సవాలు

పలు ప్రాంతాల్లో నిమజ్జనం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు ప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు జరిగాయి. ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆత్మకూరు, కోడుమూరు పట్టణాలతో పాటు అన్ని మండలాల్లో వినాయక నిమజ్జనం పూర్త యింది. ప్రధాన పట్టణాల్లో ఐదు రోజులకు నిమజ్జనం జరగనుంది. ఎమ్మిగనూరులో 350కి పైగా విగ్రహాలను ఎల్లెల్సీలో నిమజ్జనం చేశారు. యువత కేరింతలు, డీజే సౌండ్ నడుమ పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది. ఇదిలా ఉండగా నంద్యాల, కర్నూలు, డోన్ తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వెరైటీ వినాయకులు ఆకట్టుకుంటున్నాయి. కర్నూలు మించిన్‌బజార్‌లో విఘ్ననాయకుడు ఇస్కాన్ గణపతి రూపంలో దర్శనమిస్తుండగా, కుమ్మరి వీధిలో కృష్ణ భగవానుడిని భుజంపై ఎత్తుకొనే విగ్రహం ఆకట్టుకుంటోంది. కుమ్మరి వీధిలో శంఖచక్రాలను ధరించిన గణపతి, కాళికాంబ గుడి వద్ద ఆదిశేషుని దాల్చిన గణపతి, బండిమెట్టలో సూర్య భగవానుడిని వెనుక దాల్చిన గణపతి, అక్కడే నుదిట అమ్మవారిని ధరించిన గణపతి మూర్తులు ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. పూలబజార్‌లో గరుడ మూర్తిని చేతదాల్చిన వినాయకుడు, అదేప్రాంతంలో త్రిముఖ గణనాధుడు, చిన్న అమ్మవారిశాల వద్ద బసవ రధంపై గణనాధుడు, బొంగుల బజార్‌లో వీణాగణపతి మూర్తులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.



కర్నూలు పెద్ద అమ్మవారిశాల వద్ద..



ఆదోని బుద్దేకల్‌లో పూజలందుకుంటున్న ఏకదంతుడు



కర్నూలు మించిన్ బజార్‌లో



ఆదోని: రాజరాజేశ్వరి నగర్‌లో పర్యావరణ పరిరక్షణకై వెలిసిన లంబోదరుడు

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

● జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయకుమార్



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఒలింపిక్ సంఘం సభ్యులు, క్రీడా ప్రతినిధులు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హాకీ మాంత్రికుడు.. మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని చక్కటి ప్రతిభ కనబరిచి క్రీడల్లో రాణించాలని కర్నూలు జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో పి.విజయ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి సీఈవోతో పాటు డీఎస్‌డీవో భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ హాకీలో రాణించి దేశానికి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.సునీల్ కుమార్, సహాయ కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి, సభ్యులు అవినాశ్ శెట్టి, శివ, సతీష్, శ్రీనివాసులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాస్రవంతి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం



తెలుగు కళాస్రవంతి ఆధ్వర్యంలో సత్కారం పొందిన ఐదుగురు సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు కళాస్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తెలుగు భాషా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలుగు సాహిత్యంలో రాణిస్తున్న ఐదుగురు కవులకు గిడుగు రామమూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారాలను అందజేశారు. రచయిత ఎస్‌డీవీ అజీజ్, కవులు నాగమణి, మారుతీ పౌరోహితం, తెలుగు వెంకటేశ్, కెంగార మోహన్‌లకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ తెలుగు భాష రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్న చరిత్రగల భాష అని గుర్తు చేశారు. భాషను దూరం చేసుకుంటూ మన సంస్కృతి, సంప్రదాయ మూలాలను దూరం చేసుకున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు కళాస్రవంతి అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎండీ ఇనాయతుల్లా, ఎస్.మహమ్మద్ మియాలు మాట్లాడుతూ తెలుగు భాషాభిమానులు, రచయితులు, కవులు కళాకారులు ఒక్కరోజుతో తెలుగు భాషా దినోత్సవాన్ని సరిపెట్టకుండా ఏడాది పొడవునా భాషకు సంబంధించిన అనేక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలపించిన తెలుగు గేయాలు, గజల్స్ అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేజీ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో...



నివాళి అర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో తెలుగు వ్యవహారిక భాష ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలు గు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి హాజరై గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ మధురమైన భాష తెలుగు అని, తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు మురళీమోహ న్‌రెడ్డి, బసవశేఖర్, పుల్లయ్య, సి.రాంగోపాల్, బాబుభాస్కర్, ఉద్యోగులు కల్యాణి, పుష్ప, వాణి, వాజిదా తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై ప్రవాసాంధ్రుల ఆదరణ అభినందనీయం

టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమైన తెలుగు భాషా దినోత్సవాలు



రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో సత్కారం పొందిన సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష పట్ల తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ తగ్గుతుంటే, తెలుగు వారు నివసించే ప్రపంచ దేశాల్లోని ప్రవాస ఆంధ్రుల్లో పెల్లుబికుతున్న భాషాభిమానం అభినందనీయమని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. శుక్రవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన విద్యార్థుల ప్రతిభా పోటీలకు వందలాదిగా విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు భాష ఆవశ్యకతను తెలియజేసేలా తమ అభిప్రాయాలను వ్యాసరూపాల్లో అందజేశారు. సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు తొలుత తెలుగుతల్లి, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు పూలదండలు వేసి తెలుగు గీతాలను ఆలపించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా, టీజీవీ కళాక్షేత్రం మూడు రోజుల పాటూ తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. కళాక్షేత్రం చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సలహా, సూచనల మేరకు మూడు రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు దండెబోయిన పార్వతీదేవి, దేవేంద్రప్ప, స్వరూప్ సిన్హా, గద్వాల ఈరన్న, శ్రీనివాసరెడ్డి, సునీత రాణి, రాణి లీలావతి, హసీనాబీ, పుణ్యవతి, పార్వతయ్య, వెంకటేశ్వర్లు, చక్రపా ణి, ధరిత్రిదేవి, బాలస్వామి, బలరామయ్య, హరిశ్చంద్రారెడ్డి, ఎం.హరికిషన్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, సభ్యులు శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, పి.రాజరత్నం, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



నేడు 'రికార్డు' స్థాయిలో పౌరాణిక ప్రదర్శన

టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభిస్తారని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే కళాకారులకు సత్కారం, ప్రశంసాపత్రంతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. 24 గంటల పాటు జరిగే ఈ ప్రదర్శనలను తెలుగుబుక్ ఆఫ్ రికార్డులో నమోదు కానుంది.



టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషపై నిర్వహించిన పోటీలకు హాజరైన విద్యార్థులు

అమ్మ భాషను కాపాడుకుందాం

మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమ్మవంటి తెలుగు భాషను కాపాడుకుందామని కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సం జీవ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని నవ్యాంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో, తెలుగు భాషా దినోత్సవ సదస్సును ఘనంగా నిర్వహించారు. జడ్పీ కార్యాలయం ఆవరణలోని ఎంపీపీ సమావేశ హాలులో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీతో పాటూ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బా రెడ్డి, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగముని, బాలల సాహిత్యవేత్త డాక్టర్ ఎం. హరికిషన్, బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, న్యాయవాది డాక్టర్ ఆర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎస్పీ డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా హాజరయ్యారు. రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలపూల వేసి నివాళులర్పించారు. నవ్యాంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు మల్లెపోగు రాజన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమలో మాజీ ఎంపీ మాట్లాడారు. బాలసాహిత్యంలో విశేష కృషిచేస్తున్న డాక్టర్ ఎం.హరికిషన్‌ను సత్కరించారు. ప్రముఖ రచయిత ఎస్ ముర్తుజా, కవయిత్రి రాణి లీలావతికి పురస్కారాలు ప్రదానం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూసీపీఎల్ఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎన్ రామచంద్రన్, యూసీపీఎల్ఆర్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్ (యూసీపీఎల్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు తాము చేపట్టిన పాఠశాలలు, విద్యాభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక అంశాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, అక్షరాస్యత పెంపుదల, సమాజ పురోభివృద్ధికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడ, సేవా, సహకార రంగంలో కృషి, విద్యార్థులకు మార్కుల పెరుగుదలకు చేపట్టిన ప్రయోగాత్మక అంశాలు, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపుదలకు చేసిన కార్యక్రమాలు వంటివి పూర్తి వివరాలతో పంపించాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 1వ తేదీలాగా పంపించాలని, ఎంపికైన ఉపాధ్యాయులను సెప్టెంబరు 7న ఉదయం 10 గంటలకు కర్నూలులోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సమావేశ మందిరంలో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వారు తెలిపారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

● సెట్కూరు సీఈవో వేణుగోపాల్



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

ఓర్వకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈవో కె.వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాల నివారణ, మత్తు పదార్థాల దుష్పరిణామాల అంశాలపై జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్కూరు సీఈవోతో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. ప్రపంచం నిరంతరం కొత్త టెక్నాలజీతో అభివృద్ధి చెందుతూ డిజిటల్ టెక్నాలజీతో పని చేసే స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా మన దైనందిక కార్యక్రమాల్లో భాగమయ్యాయని చెప్పారు. బ్యాంకు అధికారులమంటూ చెప్పి ఓటీపీ చెప్పించుకొని ఖాతాల్లోని నగదును మాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి, అధ్యాపకులు, సెట్కూరు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుభాష పరిరక్షణ మన కర్తవ్యం



నివాళి అర్పిస్తున్న వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు, సాహితీప్రియులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిరక్షించుకోవడం మన కర్తవ్యం అని నంది రైతు సమాఖ్య ముఖ్య సలహాదారు డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. మాతృబాషా పరిరక్షణ సమితి, నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని భారతి సీడ్స్ కార్యాలయంలో శుక్రవారం 'తెలుగుభాషా పరిరక్షణ-మన కర్తవ్యం' అనే అంశంపై చర్చ నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ అన్ని భాషలను ప్రేమించాలని, అయితే అమ్మభాషను మరువకూడదని ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, భాషాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. మనజీవన వ్యవహారాలన్నీ స్వభాషతో ముడిపడి ఉంటాయన్నారు. తెలుగుభాషలోని జాతీయాలు, చమత్కారాలు, శతక పద్యాలు, సామెతలు, పొడుపు కథలు, ఈ తరం పిల్లలు నేర్చుకునేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. శ్రీనివాసమూర్తి, డాక్టర్ కిషోర్‌కుమార్, శేషఫణి, కవులు, కొప్పుల ప్రసాద్, రచయతలు, సాహితీ సంస్థల ప్రతినిధులు, నంది రైతు సమాఖ్య ప్రతినిధులు తూము శివారెడ్డి పాల్గొన్నారు.

మాతృ భాష మధురమైనది

● నంది అవార్డు గ్రహీత గజల్ మహ్మద్ మియా



మాట్లాడుతున్న గజల్ మహ్మద్ మియా

నందికొట్కూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాతృ భాష మధురమైనది అని నంది అవార్డు, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుల గ్రహీత గజల్ మహ్మద్ మియా అన్నారు. నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవంతో పాటు, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గజల్ మహ్మద్ మియా మాట్లాడుతూ తెలుగు భాషలోని తీయనం ఒక చక్కటి సంగీతంలా కనిపిస్తోందన్నారు. ఎన్నో తెలుగు పాటలను గజల్ పాడారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ భాషాభివృద్ధి దేశాభివృద్ధి అని, భాష మానవ జీవిత మనుగడుకు ఒక చక్కటి ఉదాహరణ అని అన్నారు. కార్యక్రమంలో రఘుపతి రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,525 మందికి కాల్ లెటర్లు



శ్రీనివాస బీఈడీ కళాశాలలోని డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. మొదటి రోజు సాంకేతిక కారణాలతో కొన్ని అవాంతరాలు ఎదురైనా వాటన్నింటినీ అధిగమిస్తూ ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సర్టిఫికెట్ల పరిశీలనను పూర్తి చేశారు. అయితే సర్టిఫికెట్ల పరిశీలన మాత్రమేనని, ఈ అభ్యర్థుల ఎంపిక తుది జాబితా కాదని విద్యాశాఖ అధికారులు చెబుతుండటంతో అభ్యర్థుల గుండెల్లో మరో టెన్షన్ మొదలైంది. మొదటి రోజున 2,307 మంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ జారీ అయ్యాయి. అలాగే రెండో రోజున 218 మందికి కాల్ లెటర్లు జారీ అయ్యాయి. మొత్తం 2,525 మంది అభ్యర్థులకు గానూ 24 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పెండింగ్‌లో ఉంది. వారి సర్టిఫికెట్లను కూడా పరిశీలించి వందశాతం పూర్తి చేసి వివరాలను పంపుతామని డీఈవో శ్యామూల్‌పాల్ చెప్పా రు.

సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలి

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నగర సమీపంలోని శ్రీనివాస బీఈడీ కళాశాల కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించి వెరిఫికేషన్ పరిశీలన బృందాలతో మాట్లాడారు. కాల్ లెటర్స్ పరిశీలనకు సంబంధించి ఎప్పటికప్పుడు వ్యక్తిగత లాగిన్‌లో సమాచారాన్ని అప్‌లోడు చేస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ వివరించారు. సర్వర్ సమస్య పునరావృతం కాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా హైఫై ఇంటర్నెట్‌తో నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఏడీ వి.ప్రతాప్‌రెడ్డి, అబ్రహాం, కడప ఆర్జేడీ శామ్యూల్, కర్నూలు, నంద్యాల డీఈవోలు శామ్యూల్ పాల్, జనార్దన్‌రెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు, ఏడీలు, మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ఆధిపత్య పోరు



- ఇద్దరు అధికారుల మధ్య కోల్డ్ వార్
- నలిగిపోతున్న వైద్య సిబ్బంది
- వాదనకు దారితీసిన బిల్లు విషయం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లు విషయం ఇద్దరు అధికారుల మధ్య వాదనకు దారితీసింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇద్దరు అధికారుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. పాలన వ్యవహారాలకు సంబంధించిన ఓ‌అధికారి తనకు అన్ని చెప్పాల్సిందేనని ఒకరు.. నిబంధనల ప్రకారం తాను కీలకమైన అధికారినంటూ మరో అధికారి.. ఇలా ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు

పాలన వ్యవహారాలు చూసే ఓఅధికారి, హాస్పిటల్ వ్యవహారాలు చూసే మరో అధికారి. ఇద్దరు వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కర్నూలు మెడికల్ కాలేజీ పెథాలజీ డిపార్టుమెంట్‌లో సీడీఎస్ నిధుల కింద రూ.లక్షతో పనులు చేపట్టేందుకు కేఎంసీ ప్రిన్సిపాల్ మంజూరు చేశారు. ఈపనులు పూర్తయ్యాక వ్యయం లక్షకు కాస్త ఎక్కువైంది. ఈ విషయం పెథాలజీ హెచ్‌వోడీ, ప్రిన్సిపాల్‌కు ఓఅధికారికి చెప్పడంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదనపు బడ్జెట్ బిల్లుపై అధికారులు కూడా సంతకాలు చేశారు. వారం రోజుల క్రితం ఇద్దరు అధికారులు బిల్లుకు సంబంధించిన విషయంపై కేఎంసీ ప్రిన్సిపాల్‌ను కలవడానికి ఒకే కారులో బయలుదేరారు. అదనపు బడ్జెట్ బిల్లు విషయం తనకు ఎందుకు చెప్పలేదని అధికారి మరో అధికారిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆఫైల్ మీరు కూడా చూశారని, సంతకం కూడా పెట్టారని సమాధానం చెప్పడంతో ఆ అధికారికి చిరెత్తికొచ్చినట్లు సమాచారం. ఈ బిల్లు ప్రిన్సిపాల్ ఆమోదం తెలిపారని చెప్పడంతో తనకు చెప్పకుండా ఎలా సంతకం పెట్టించారంటూ వాదనకు దిగారు. దీంతో ఆఅధికారి కూడా తానేమీ అటెండర్‌ను కాదని, గెజిటెడ్ ఆఫీసర్‌ను అని, ఫైల్‌ను మీ దగ్గరకు పంపించామని, మీకు ఆ ఫైల్‌పై అభ్యంతరాలు ఉంటే డిస్కస్ అని రాయాలని ఘాటుగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రగిలిపోయిన అధికారి మరో అధికారిని కారులో ఎక్కించుకోకుండా హాస్పిటల్‌కు బయలుదేరినట్లు సమాచారం. ఇలా ఇద్దరు అధికారుల మధ్య పోరు జీజీహెచ్‌లో రావణ కాష్టంగా తయారైంది.

విదేశీ పర్యటన అంశంపైనే..

జీజీహెచ్‌లోని ఓ అధికారి నాలుగు నెలల క్రితం ఎలాంటి అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆఫీసర్ విదేశీ పర్యటనకు వెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఆ అధికారి ప్రభుత్వ అనుమతుల్లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లి రావడంతో మరో అధికారికి ఆయుధం చిక్కినట్లు అయ్యింది. ఈవిషయాన్ని పదే పదే ప్రశ్నించినట్లు తెలిసింది.

ప్రభుత్వ వాహనాన్ని సొంత అవసరాలకు..

ఆసుపత్రిలో ఓఅధికారికి ప్రభుత్వం అద్దె వాహనాన్ని సమకూర్చి ప్రతి నెల రూ.45వేలు బిల్లు చెల్లిస్తుంది. వాస్తవానికి ఈఅద్దె వాహనం కర్నూలు లేదా ఆఫీసు పని ఉంటే మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లవచ్చు. సదరు అధికారి అధికారిక విధులకు వాడాల్సిన వాహనాన్ని స్వంత అవసరాలకు వినియోగిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈఅద్దె వాహనానికి సంబంధించిన బిల్లును పెండింగ్‌లో పెట్టడంతో ఇద్దరు అధికారుల మధ్య వివాదం మొదలైంది. ఈబిల్లు పెట్టడంలో కొంత జాప్యం చేయడంతో అధికారి ససేమిరా అనడంతో అప్పటి నుంచి ఇద్దరు అధికారుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వారిద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఆసుపత్రి ఉద్యోగులు, వైద్యులు నలిగిపోతున్నారు. వైద్య విద్య ఉన్నతాధికారులు కలెక్టర్ జోక్యం చేసుకుని ఇద్దరి అదికారుల మధ్య కోల్డ్‌వార్‌ను నివారించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి గొడవలు లేవు



కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇద్దరు అధికారుల మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్‌పై సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లును 'ఆంధ్రజ్యోతి' కోరగా ఎలాంటి గొడవలు లేవన్నారు. పాలనాపరంగా చిన్నచిన్న విషయాలు ఉంటాయని, ఈ విషయాన్ని ఆయన కొట్టి పారేశారు.

- డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోవెలకుంట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల - ఆళ్లగడ్డ వెళ్లే ప్రధాన రహదారిలో భీమునిపాడు ఎస్సీ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలివీ.. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన గడ్డం వీరేంద్ర (30) అనే యువకుడు బైకుపై కోవెలకుంట్లకు వస్తుండగా కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డ వెళుతున్న వాహనం బీమునిపాడు గ్రామం ఎస్సీకాలనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఢీకొట్టింది. దీంతో వీరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. వీరేంద్ర పట్టణంలోని ఓ షాపులో టైలరుగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని ఒక ప్రైవేటు అతిథి గృహంలో పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ పట్టణానికి చెందిన రవి (47)అనే వ్యక్తి లాడ్జి బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. రవి రెండురోజుల క్రితం లాడ్జీలో క్లీనింగ్ చేయడానికి కూలీగా చేరారు. శుక్రవారం తెల్లవారుజామున లాడ్జి బాత్‌రూమ్‌లో గడిపెట్టుకొని పంచాతో ఉరివేసుకున్నారు. ఆయనతో పాటు పనిచేసే వారు యజమానులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరేకొని బాత్‌రూమ్ డోర్‌ను తెరిచి మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి అడ్రస్ తెలియకపోవడంతో శివమొగ్గ పోలీసులకు సమాచారం ఇచ్చారు. లాడ్జి యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి జీపు బోల్తా

పాణ్యం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఓ జీపు వెనుక టైరు ఊడిపోవడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని బలపనూరు సమీపంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న జీపు వెనుక చక్రం ఊడిపోవడంతో జీపు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనున్న రోడ్డుపై బోల్తా పడింది. జీపులో 12మంది ప్రయాణికులు ఉన్నారు. గాయపడ్డ ప్రయాణికులను చికిత్స నిమిత్తం శాంతిరాం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

పత్తికొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు. వివరాలు.. మండలంలోని చక్రాల గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డికి క్రిష్ణగిరి మండలంలో కంబాలపాడుకు చెందిన శిరీషతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అతడు బండలాగుడు ఎద్దుల పోటీల్లో పాల్గొనేందుకు తరుచూ వెళ్లేవాడు. అలా వెళ్లిన ప్రతిసారి నెలా, రెండు నెలలు వరకు ఇంటికి రాడని, ఫోన్ కూడా ఇంటి వద్దే ఉంచి వెళ్తాడని భార్య ఫిర్యాదులో పేర్కొంది. మూడు నెలలైనా భర్త నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో శుక్రవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు నెలల క్రితం గ్రామంలో పద్మనాభరెడ్డికి, మరోవ్యక్తికి ఘర్షణ చోటుచేసుకుందని ఆరోజు నుంచే అతడు కనిపించడం లేదని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభం

డోన్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నూతన భవనంలో అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 1 నుంచి 5వ తరగతి వరకు ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. డోన్‌లో కేంద్రీయ విద్యాలయానికి సొంత భవనం ప్రస్తుతం లేకపోవడంతో ఐటీఐ కళాశాల నూతన కాంప్లెక్స్‌లో ఉన్న భవనాన్ని కేంద్రీయ విద్యాలయానికి వినియోగించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన అడ్మిషన్ల ప్రవేశానికి సంబంధించి దరఖాస్తులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎగబడ్డారు.

'బాల భారతి'కి బాసట...

- వరుసగా ఆరో ఏడాది రూ.10 లక్షల విరాళం
- కర్నూలు ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వితరణ
- ఇష్టంగా చదివి ఉన్నతంగా ఎదగాలి : డీఐజీ ప్రవీణ్



చెక్కును అందజేస్తున్న కోయ ప్రవీణ్, పొట్లూరి రవి

ఓర్వకల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఓర్వక ల్లు మండల పొదుపులక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలోని బాలభారతి పాఠశాల పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం తానా డైరెక్టర్, కర్నూలు ఎన్నారై ఫౌండేషన్ చైర్మన్ పొట్లూరి రవి వరుసగా ఆరో ఏడాది రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆ విరాళం చెక్కును, పాఠశాల వ్యవస్థాపకురాలు విజయభారతికి అందజేశారు. ముందుగా పాఠశాల్లో ఏర్పాటుచేసిన వినాయకుడికి, వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు చేయూతనిస్తూ కర్నూలు ఎన్నారై ఫౌండేషన్ చైర్మన్ పొట్లూరి రవి పేద విద్యార్థులకు ఆరేళ్లుగా ఏటా ఆర్థిక సహాయం అందించడం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్నారైలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో తమవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. స్కౌట్స్ అండ్ గైడ్‌లో రాజ్య పురస్కారానికి అర్హత సాధించి, గవర్నర్‌తో ప్రశంసాపత్రం అందుకున్న ఈ పాఠశాల విద్యార్థిని గీతను అభినందిస్తూ ఆయన రూ.5వేలు బహుమతి అందజేశారు. అనంతరం డీఐజీ కోయ ప్రవీణ్‌తో పాటు పొట్లూరి రవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ ముప్పా రాజశేఖర్, కర్నూలు డీఎస్పీ బాబూ ప్రసాద్, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, పొదుపులక్ష్మి సంఘం సభ్యులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న పొట్లూరి రవి

ఆటంకాలు లేకుండా చదువుకోవాలనే: పొట్లూరి రవి

అనాథ విద్యార్థుల ఎలాంటి ఆటంకాలు లేకుండా చదువుకోవాలనే ఉద్దేశంతో విరాళాన్ని అందిస్తున్నట్లు పొట్లూరి రవి అన్నారు. ప్రతి సంవత్సరం రూ.10లక్షల చొప్పున పాఠశాల యజమాన్యానికి ఐదేళ్లుగా విరాళాన్ని అందిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న బాలభారతి పాఠశాలకు భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందజేస్తామని పలువురు ఎన్ఆర్ఐలు ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందిస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పొదుపు సంఘం మహిళలు శ్రమశక్తితో నిర్మించుకున్న బాలభారతి పాఠశాల మహిళా శక్తికి నిదర్శనమని పొదుపు మహిళలను అభినందించారు. ఎన్ఆర్ఐలు సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషించడంతో వారిని విజయభారతి అభినందించారు.

కూతురిని విదేశానికి పంపి.. తండ్రి అనంతలోకాలకు



విజయ్‌కుమార్ (ఫైల్)



అదుపుతప్పి రోడ్డుపక్కకు వెళ్లిన ప్రమాదానికి గురైన కారు

ఎర్రవల్లి/ ఎమ్మిగనూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురిని విదేశానికి సాగనంపేందుకు వెళ్లిన తండ్రి తిరుగు ప్రయాణంలో అనంతలోకాలకు వెళ్లిన హృదయవిదారక సంఘటన చోటుచేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం స్టేజీ దగ్గర 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. ఈఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కొదండాపురం ఎస్ఐ మురళి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకి చెందిన విజయ్‌కుమార్(60), మాధవి దంపతులు కలిసి తమ కుమార్తె నందినిని లండన్‌కు పంపేందుకు గురువారం రాత్రి ఎమ్మిగనూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కారులో వెళ్లారు. కూతురిని విమానాశ్రయంలో డ్రాప్ చేసి శుక్రవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై గల ధర్మవరం స్టేజి దగ్గర డ్రైవర్ అజాగ్రత్తతో ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు రోడ్డు పక్కకు అదుపు పడిపోయింది. విజయ్‌కుమార్ తలకు గాయాలు కాగా ఆయన భార్య మాధవి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అప్పటికే విజయ్‌కుమార్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలపాలైన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిలుకూరు నయాన్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొలిక్కిరాని గ్రేడింగ్ సమస్య

- నేడు క్రయవిక్రయాలు నిలుపుదల

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ రైతులను తీవ్రంగా నష్టం చేకూరుస్తున్న గ్రేడింగ్ సమస్య కొలిక్కి రాలేదు. శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వేరుశనగ దిగుబడులకు క్రయవిక్రయాలు జరగవని మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శి శాంతకుమార్ తెలిపారు. రైతులు తాము పండించిన వేరుశనగ దిగుబడులను మార్కెట్ కమిటీకి తీసుకురావద్దని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాసింగ్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నా మన్నారు. మార్కెటింగ్ చట్టంను ఉల్లంఘించి వ్యాపారులు గ్రేడింగ్ చేయడం పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి రైతులకు మేలు చేకూర్చాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉల్లి రైతుల కష్టాలపై స్పందించిన సీఎం

- అమరావతిలో ఉన్నతాధికారులతో సమీక్ష

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉల్లి రైతుల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న కథనాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తక్షణమే ఉల్లి రైతును ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. క్వింటం ఉల్లిని రూ.1,200కు చెల్లించి ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు, నిల్వలు ఉమ్మడి జిల్లాలో ఏ విదంగా ఉన్నాయో అనే అంశంపై సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాలపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బతిన్న కారణంగా మహారాష్ట్రలో ఉల్లి పంట ఎక్కువగా ఉన్నందు వలన ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. రానున్న పది రోజుల్లో 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట కర్నూలు యార్డుకు వచ్చే అవకాశం ఉందని సీఎంకు వారు వివరించినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. శనివారం నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో రైతులతో క్వింటం ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు.

జీఎస్టీ సజావుగా చెల్లించాలి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చట్ట ప్రకారం జీఎస్టీ సజావుగా చెల్లించేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జీఎస్టీ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు కాంట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించి జీఎస్టీ పన్ను చెల్లించేలా చూడాలని అన్నారు. ప్రైవేటు సంస్థలు, ఔట్‌సోర్సింగ్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులు ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ, అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, డిప్యూటీ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఆక్రమణలు ఆగేనా?



ప్యాపిలి, ఫొటో నెం:3 వాల్మీకి గుహాలను సందర్శిస్తున్న విదేశీ పర్యాటకులు (5వ పేజీ తరువాయి)

నగరంలో ప్రవహించే హంద్రీ నదీతీరం ఇరువైపుల ఆక్రమణలకు అడుకట్ట పడేనా? ఇప్పటికే చేసిన ఆక్రమణలు తొలగిస్తారా? నదీతీరం సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసు కుంటారా? [illegible] తులు కనువిందు చేస్తున్నాయని పర్యాటకులు చెప్పారు.

కేంద్ర మార్గదర్శకాలు ఇవే..

- నదీతీరాల నుంచి 500 మీటర్ల దూరం వరకు ల్యాండ్ ఫీల్డ్ సైట్లు, మునిసిపాలిటీ, నగరపాలక సంస్థలు, పరిశ్రమల వ్యర్థాలు వేయరాదని నిషేధాజ్ఞలున్నాయి.
- ఐదేళ్లకు ఒకసారి వరదలు పునరావృతమయ్యే ప్రాంతాలను ప్రొటెక్టెడ్ జోన్‌గా కేంద్రం ప్రకటించింది. తాజాగా మార్గదర్శకాలు ప్రకారం ఈజోన్‌లో శాశ్వత నిర్మాణాలు, వ్యర్థాలు వేయడం, ప్రమాదకర పదార్థాలు నిల్వ చేయడం నిషేధం.
- ప్రతి ఐదేళ్లకు ఒకసారి, పాతికేళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని రెగ్యులేటర్ జోన్‌గా ప్రకటించారు. ఈ జోన్లో కార్యకలాపాలు కఠినంగా నియంత్రిస్తారు.
- పాతికేళ్లకు ఒకసారి, అదేవిధంగా ప్రతి 100ఏళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని వార్నింగ్ జోన్‌గా పేర్కొన్నారు. ఇక్కడ తక్కువ ప్రమాదకర కార్యకలాపాలకు అనుమతి ఉన్నా, వరద ముప్పు అంచనాలు వేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారు.
- హంద్రీ నదికి 1997 నుంచి 2009 వరకు 12 ఏళ్లలో నాలుగుసార్లు భారీ వరదలు వచ్చాయి. 2007, 2009లో మూడేళ్లలో రెండుసార్లు 2-3 లక్షల క్యూసెక్కులకు పైగా వరదలు వచ్చాయి. ఎప్పుడు వరద వస్తుందో? అంటూ నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ప్రొటెక్ట్ జోన్ జాబితాలో చేర్చాలని, కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.
- తుంగభద్ర నది మునగాలపాడు నుంచి జోహరాపురం వరకు కర్నూలు నగరం అంచున ప్రవహిస్తుంది. 2009లో వచ్చిన వరద ఊహకు అందనిది. ఈ నదీ తీరాన్ని కూడా ప్రొటెక్టెడ్ జోన్‌గా గుర్తించాలని పలువురు కోరుతున్నారు. మునగాలపాడు నుంచి రోజాదర్గా వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నదీతీరం అంచుల్లో శాశ్వత భవనాలు నిర్మాణాలు చేస్తున్నారు. అంకురంలో అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

నదీతీరంలో రహదారులు నిర్మించాలి

ప్రజలను వరద ముప్పు నుంచి రక్షించాలంటే నదీతీరాల్లో శాశ్వత భవనాలు నిర్మించకుండా చర్యలు తీసుకోవాలి. బఫర్ జోన్ ప్రాంతంలో విశాలమైన రోడ్లు నిర్మించాలి. రహదారులపై ప్రజలు, వాహనదారులు రాకపోకల వల్ల వరద ప్రమాదం గుర్తించి ముప్పు నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది. నగరంలో హంద్రీ నదీతీరం ఇరువైపుల ఆక్రమణలు వాస్తవమే. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి, సరిహద్దులు గుర్తించడంతో పాటు ఆర్‌సీసీ దిమ్మెలు ఏర్పాటుచేశాం.

- బి.రామకృష్ణ, డీఈఈ, ఇరిగేషన్ ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్, కర్నూలు

ఆస్పరి మార్కెట్ వేలం రూ.కోటి

ఆస్పరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి గ్రామ పంచాయతీ కూరగాయల మార్కెట్ వేలం పాట రూ.ఒక కోటి పలికిందని శుక్రవారం ఎంపీడీవో గీతావాణి తెలిపారు. ఆస్పరి గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా వేలం పాటలో పాల్గొని రూ. కోటికి దక్కించుకున్నాడని గ్రామ పంచాయతీ సర్పంచ్ రాధమ్మ, కార్యదర్శి విజయరాజు తెలిపారు. వేలంలో తొమ్మిది మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. గత సంవత్సరం కంటే రూ.35 లక్షలు ఎక్కువ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, సీఐ గంగాధర్, రాఘవేంద్ర, రంగనాథ్, యుగంధర్ పాల్గొన్నారు.

యువతకు పుష్కలంగా ఉద్యోగావకాశాలు

- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయ ని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హుస్సేనాపురం గ్రామంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తూ ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యా రంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలుపుతామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో ముగ్గురిపై వేటు

కర్నూలు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాధ్యతలు విస్మరించారన్న ఆరోపణలపై ముగ్గురిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమాచారం వెల్లడించారు. గతేడాదిగా జిల్లా కార్యాలయానికి సంబంధించి అద్దె, ఇతర ఖర్చుల లెక్కలు సమర్పించకపోవడం, అక్రమాలకు పాల్పడినట్లు ఏఐసీసీ దృష్టికి రావడంతో ఇద్దరు ఉద్యోగులను తొలగిస్తున్నట్లు అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి ఎస్ఎస్ రాజా ఆదేశాలు జారీ చేశారు. అదేక్రమంలో మరో నాయకుడిని తొలగిస్తున్నట్లు ఏఐసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు.

నంద్యాల జిల్లాలోనే శ్రీశైలం కొనసాగుతుంది


మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పుణ్యక్షేత్రం నంద్యాల జిల్లాలోనే కొనసాగుతుందని, ఎలాంటి అపోహలు వద్దని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టంచేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో సామాజిక కార్యకర్త రమణారెడ్డి, టీడీపీ కన్వీనర్ విశ్వనాథరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ప్రచారం కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్‌పీఎస్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు గోవింద్‌నాయుడు, నవీన్ కుమార్ మంత్రి ఫరూక్‌ను కలిసి శ్రీశైలాన్ని నంద్యాల జిల్లాలోనే కొనసగించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జిల్లాల ఏర్పాటు సక్రమంగా జరగలేదన్నారు. పరిపాలన సౌకర్యార్థం వాటిని సరిచేసి మరో ఆరు జిల్లాల ఏర్పాటుకు అవసరమైన నివేదికలు సమర్పించాలని ముఖ్యమంత్రి సీఎం ఆదేశించారన్నారు. నంద్యాల జిల్లా నుంచి శ్రీశైలం విడిపోయే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

స్త్రీ శక్తి పథకంతో మహిళల్లో సంతోషం


మాట్లాడుతున్న కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):ఏపీ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టడంతో మహిళల్లో సంతోషం వ్యక్తమవుతోందని కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. శుక్రవారం శ్రీశైలం ఆర్టీసీ బస్టాండులో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానికులు శ్రీశైలంలో డిపో ఏర్పాటు చేయాలని, సర్వీసులు కావాలని వినతి పత్రాలు అందజేశారు. స్థానికి ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్ఎం రజియా సుల్తానా, ఆత్మకూరు డీఎం వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం లీజుకు వేలం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన కల్యాణ మండపాన్ని మూడు సంవత్సరాలు లీజుకు ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వియల్ రామానుజన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబరు 4వ తేదీన ఉదయం 11గంటలకు దేవస్థానంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి శిల్పా సేవా సమితి వారు కల్యాణ మండపం నిర్మించారన్నారు. ఈ కల్యాణ మండపాన్ని ఈనెల 23వ తేదీన దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. కావున ఆ కల్యాణ మండపానికి లీజుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండపం ఆవరణంలోని సప్లయర్స్, సామగ్రి, లైటింగ్ డెకరేషన్ సామగ్రి ఉంచుకునే రెండు గదులకు కూడా సెప్టెంబరు 4వ తేదీన వేలం పాట ఉంటుందన్నారు. ఆలయ సిబ్బంది రమణ, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వశాంతి మహాగణపతి హోమం


హోమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, భక్తులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాజి కాంప్లెక్స్ కల్యాణ మండపంలో వరసిద్ధి వినాయక విశేష పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విశ్వశాంతి మహాగణపతి హోమం వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణ మండపం అర్చకుడు నిఖిలేష్ శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కశెట్టి క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్, నారాయణ శ్రీనివాసకుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోసంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైల దేవస్థానం గోసంరక్షణ పథకానికి హైదరాబాదుకు చెందిన బాల బ్రహ్మచారి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ పర్యవేక్షకుడు శివప్రసాద్‌కు అందజేశారు.

వైభవంగా ఊయలసేవ

శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు వైభవంగా ఊయలసేవ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమంతో పాటు సాయంత్రం లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తూ స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా, షోడషోపచార పూజ, ఊయలసేవ నిర్వహించారు.

అంకాలమ్మకు విశేష పూజలు

లోకకల్యాణార్థం శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాళమ్మ తల్లికి శుక్రవారం విశేష పూజలు చేశారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిం చారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


బహుమతులు అందుకున్న విద్యార్థులతో గురురాజ పాఠశాల యాజమాన్యం

నంద్యాల హాస్పటల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హాకీ మాంత్రికుడిగా పేరొందిన మేజర్ ధ్యాన్‌చంద్ ఒలంపిక్ క్రీడల్లో భారత హాకీ జట్టును విజయాలబాటలో నడిపించారన్నారు.

గురురాజ పాఠశాలలో...

నంద్యాల పట్టణంలోని గురురాజ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పుల్లయ్య, వెంకటరెడ్డి, ముని, సంజీవ, సందీప్, శశి, వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శశికళ ఆధ్వర్యంలో క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు.

దసరా ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించుకుందాం: ఈవో

మహానంది, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించుదామని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది క్షేత్రంలో వెలసిన కామేశ్వరీదేవి అమ్మవారికి సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఈవో దేవస్థానం ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వాహణ, అలంకారాలు, ఇతర ఏర్పాట్లను దాతల సహకారం తీసుకొని దిగ్విజయంగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఉభయదాతలకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అర్జునశర్మ, ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో వర్షం

జూపాడుబంగ్లా,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి వర్షం కురిసింది. కేజీ రోడ్డుపక్కన కాల్వలు పూడిపోవడంతో వర్షపునీరు ప్రవహించి మార్కెట్ సమీపంలో కాలనీల్లోకి చేరాయి. జంగాలపేటలో ఇళ్లమధ్య నీరు చేరింది. అంగన్‌వాడీ-1 కేంద్రంలో వాననీటితో పుస్తకాలు, సరుకులు తడిసిపోయినట్లు అంగన్‌వాడీ కార్యకర్త వెంకట రమణమ్మ తెలిపారు.

శ్రీశైలాన్ని వదులుకునే ప్రశక్తే లేదు

- ఆత్మకూరులో తోటగేరి కాలనీవాసుల నిరసన


ఆత్మకూరులో నిరసన చేస్తున్న ప్రజలు

ఆత్మకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలో చేర్చాలన్న కొందరి డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ ఆత్మకూరు పట్టణంలోని తోటగేరి కాలనీవాసులు శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. 'కాశ్మీరం భారత పరువు.. శ్రీశైలం మా గుండె దరువు' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అలాగే దూరం పేరుతో మా మల్లన్నను మానుండి దూరం చేయకండి అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. వందల ఏళ్ల నుంచి శ్రీశైలం కర్నూలు జిల్లా పరిధిలోనే ఉండేదని ప్రస్తుతం జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకాశం జిల్లా పరిధిలోకి చేర్చాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించాలని విన్నవించారు.

నిమజ్జనంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల వాదోపవాదాలు
- ఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఆర్డీవో


సంఘటనా స్థలంలో కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

వెలుగోడు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయకుల నిమజ్జనం సందర్భంగా వెలుగోడు పట్టణంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. డప్పులు వాయించే విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. డప్పులు వాయించకుండా వెళ్లాలని ఓ వర్గం, డప్పు వాయిస్తే తప్ప వెళ్లేదే లేదని మరో వర్గం వారు పట్టుబట్టారు. శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల వరకు ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. 9 గంటల సమయంలో పోలీసులు ఇరువర్గాలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఓ దశలో ప్రార్థన ఆలయంపై కొందరు గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేసి బాణసంచా కాల్చి విసరడంతో సమస్య మరింత జటిలంగా మారింది. దీంతో ఘటనా స్థలానికి తహసీల్దార్ శ్రీనివాసులుగౌడు, ఆర్డీవో నాగజ్యోతి, జేసీ విష్ణుచరణ్ చేరుకుని ఇరువర్గాలతో చర్చించి విగ్రహాలు వెళ్లేందుకు ప్రయత్నించారు. రెండు విగ్రహాలు డప్పులు వాయిస్తూ వెళ్లగా.. తిరిగి మరోవర్గం వారు డప్పులు వాయించకూడదంటూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో పరిస్థితి చేదాటుతుందని భావించిన అధికారులు ప్రత్యేక పోలీసు బృందాలను పిలిపించారు. భాష్పవాయువును ప్రయోగించే వజ్రావాహనం తెప్పించారు. అలాగే ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో చర్చిస్తున్నారు. అయితే విగ్రహాల నిర్వాహకులు ఎస్సీ కాలనీతో పాటు ఆత్మకూరు, వెలుగోడు రహదారిలో విగ్రహాలు ఉన్న ట్రాలీలు ఎక్కడికక్కడే నిలబెట్టి ట్రాక్టర్ ఇంజన్లను తీసుకెళ్లారు. దీంతో విగ్రహాలు రహదారుల వెంట నిలిచిపోయాయి. అధికా రులు రాత్రి 11 గంటలు దాటినా ఇంకా మంతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ తర్వాత ఘటనా స్థలానికి కలెక్టర్ రాజకుమారి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

బై బై.. గణేశా..

- ఘనంగా గణేశ్ నిమజ్జనం

వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం నిమజ్జన క్రతువును వైభవంగా నిర్వహించారు. బుధవారం మండపాల్లో కొలువైన గణనాథులకు పూజలు చేసి శుక్రవారం సాయంత్రం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, వాయిద్యాలు, బాణసంచా మధ్య గంధం చల్లుకుంటూ నిమజ్జనాలకు చెరువులు, కేసీ కెనాల్, కుందూనది, వాగులకు తరలించారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


బండిఆత్మకూరులో గ్రామోత్సవానికి తరలుతున్న గణనాథుడు


మహానందిలో వినాయక ప్రతిమలకు పూజలు నిర్వహిస్తున్న అధికారులు


జూపాడుబంగ్లా: గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు


గడివేముల: గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న భక్తులు


మిడుతూరులో గణేశ్ నిమజ్జనం


గోస్పాడులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్


ఆత్మకూరు: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


ఆత్మకూరు: లడ్డూ దక్కించుకున్న దాతలకు సత్కారం

18 బార్లకు 76 దరఖాస్తులు

- మూడింటికి మరోసారి నోటిఫికేషన్
- జనరల్-2, కల్లు గీత కార్మికులు-1
- నేడు ఉదయం 8 గంటలకు మొదటి టెండర్ ఓపెన్
- ఉదయం 6 గంటల నుంచి అనుమతి


దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నంద్యాల జిల్లాలోని బార్లకు ఊహించని విధంగా ఆశావహుల నుంచి దరఖాస్తులు దాఖలయ్యాయి. టెండర్ దాఖలుకు చివరిరోజైన శుక్రవారం పెద్దఎత్తున పోటీపడి మరీ వ్యాపారులు దరఖాస్తులు చేయడంతో సందడి..సందడిగా మారింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ నేతృత్వంలో ఈఎస్‌టీఎఫ్ రాముడు, పలువురు సీఐలు, సిబ్బంది కలిసి టెండర్లను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా బార్ల వ్యాపారులు దరఖాస్తులు దాఖలు చేయడానికి తరలివచ్చారు. టెండరు దాఖలు సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టారు. తద్వారా జిల్లాలోని జనరల్-19, గీత కార్మికులు-2, మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 21 బార్లు ఉండగా.. 18 బార్లకు- 76 మంది వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన మూడు బార్లకు త్వరలోనే మరోసారి నోటిఫికేష్ ఇవ్వనున్నట్లు ఈఎస్ రవికుమార్ తెలియజేశారు. వీటిలో కూడా జనరల్-2 (డోన్, నందికొట్కూరు), గీత కార్మికులు-1(డోన్, ఈడిగ) బార్లకు నిబంధనలు ప్రకారం టెండర్లు దాఖలు కాలేదు. కావున వీటికి మరోమారు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. జిల్లాలోని నంద్యాల-14, ఆళ్లగడ్డ-1, ఆత్మకూరు-1, బేతంచెర్ల-1 బార్లకు ఒక్కొక్క బార్‌కు నాలుగు చొప్పున 68 టెండర్లు, నందికొట్కూరు బార్-2, నంద్యాలలోని గీత కార్మికులు గౌడ్-1 బార్‌కు - 6 మంది టెండర్లు దాఖలు చేశారు.

ఉదయం 8 గంటలకు టెండర్ ఓపెన్

టెండర్లు దాఖలైన జనరల్ కేటగిరి 17 బార్లతో పాటు కల్లు గీత కార్మికులకు చెందిన-1 బార్‌కు సంబంధించి నేడు(శనివారం) ఉదయం 8 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ భవన్‌లో మొదటి టెండర్ ఓపెన్ చేస్తారు.

కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఈఎస్ రవికుమార్ తదితర అధికారుల సమక్షంలో టెండర్లు ఓపెన్ చేస్తారు. ఉదయం 6 గంటల నుంచి టెండరుదాఖలు చేసిన వారికి సదరు భవన్‌కు అనుమతిస్తారని ఈఎస్ రవికుమార్ తెలిపారు. కావున టెండర్ దక్కించుకున్న ప్రతి ఒక్కరూ నిబంధనలు ప్రకారం.. ఆయా బార్ల వారిగా తగిన మొత్తాన్ని చెల్లించి బార్ల లైసెన్సులు పొందాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

అమ్మభాష ఎంత మధురమో..

'కమ్మనైన అమ్మభాష ఎంత మధురమో.. మాతృభాష అమృత తుల్యం.. తెలుగు భాషా పరిరక్షణ మనందరి బాధ్యత' అంటూ కవులు, రచయితలు, సాహితీ సంస్థల ప్రతినిధులు కొనియాడారు. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం


నంద్యాల: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):అమ్మభాష తెలుగు ఎంతో మధురమైనదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. శుక్రవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి తెలుగు భాష గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగుభాష అమ్మభాష అని, అమృతతుల్యమన్నారు. గిడుగు పిడుగు లాంటి వారని, ఎన్నో సంవత్సరాలు కష్టపడి ఉద్యమించగా ఈ వ్యవహారికం మనకు సిద్ధించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శైలజ, విజయ ఆనంద్, పీడీ శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, బాలుగ్రమ్, కుసుమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై పట్టు సాధించాలి

నంద్యాల కల్చరల్: విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ భాషలతో పాటు మాతృభాషపై మంచి పట్టు సాధించాలని డాక్టర్ గెలివి సహదేవుడు పేర్కొన్నారు. నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో రామకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి అధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మన వ్యక్తిత్వానికి ప్రతిబింబం మాతృభాషే అన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు.

తెలుగు మాధ్యమం కొనసాగించాలి

మాతృభాష నేర్చుకుంటేనే విద్యార్థులలో మేధో వికాసం జరుగుతుందని సాహితీవేత్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ ఎన్జీవోస్ హోమ్‌లో తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

పాణ్యం: మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారంస్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. అలాగే తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌చెట్టి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తెలుగుజాతి గర్వపడేలా ప్రతి ఒక్కరం కృషిచేయాలని హెచ్ఎం డేవిడ్ రవిశేఖర్, తెలుగు మాస్టర్ సతీష్‌చంద్ర అన్నారు. తాటిపాడు గ్రామంలోని జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సోలార్ భూముల పరిశీలన



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

కొలిమిగుండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో సోలార్ సంస్థల కోసం కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని నందిపాడు, తిమ్మనాయినిపేట, ఎర్రగుడి తదితర గ్రామాల్లో సోలార్ ఏర్పాటు కోసం భూములు కావాలని కంపెనీలు దరఖాస్తులు చేసుకున్నాయి. జేసీ వెంట నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, కొలిమిగుండ్ల తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

లక్ష్మీనరసింహుడి సన్నిధిలో జేసీ

మండలకేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని జేసీ విష్ణుచరణ్, ఆర్డీవో విశ్వనాథ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాల ప్రాంగణం చదును



పాఠశాల ప్రాంగణాన్ని చదును చేయిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం గుంతలు , బురద మయంగా మారింది. శుక్రవారం మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి చదును చేయించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డికి హెచ్ఎం శ్రీనివాసులు, ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, రాయలసీమ సలాం, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పీడీ శ్రీధర్ సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీ నిధి భవనంలో వెలుగు అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ మండలాల ఏపీఎంలు, సీసీలు వీవోఏలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండలంలో మంత్రి బీసీ పర్యటన

కొలిమిగుండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం కొలిమిగుండ్లలో పర్యటించనున్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిన సందర్భంగా కొలిమిగుండ్లలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ నిర్వహించనున్నారు.

వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ అవరణలో సుదర్శన హోమం నిర్వహించారు. ఎగువ దిగువ అహోబిలం క్షేత్రాలలో స్వాతి నక్షత్రం వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



పవన్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో పది రోజుల క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం అనంత పురం జిల్లాలో శుక్రవారం లభ్యమైంది. బంధువులు, హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన బత్తుల పవన్ (22) లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. లారీ పని మీద కర్ణాటకకు వెళ్లి ఈ నెల 19న కుడితిని ఠాణా పరిధిలోని తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలోకి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. శుక్రవారం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీలో శవమై కనిపించాడు. స్థానికలు.. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులు ఆరా తీయగా కుడితిని పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది. సమాచారం ఇవ్వడంతో కుడుతిని పోలీసులు వచ్చి, శవాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పవన్ తండ్రి పెద్దరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారిస్తున్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

దొర్నిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంకాలమ్మ గుడి ఆవరణలో రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో భగవాన్ బలరాముడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భగవాన్ బలరాముడు సనాతన కాలంలోనే నదులను సంఘటితం చేసి రైతులకు సాగునీరు అందించడంతో రైతు బాంధవుడయ్యారన్నారు. ఆయన గుర్తుగా రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, బత్తుల నాగేశ్వరయాదవ్, ఉసేని తదితరులున్నారు.

గంగ ఒడికి గణనాథులు

- పూజలందుకున్న వినాయకులు
- ఊరేగింపుగా నిమజ్జనానికి తరలింపు



అవుకు రిజర్వాయర్‌లో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

చాగలమర్రి/ రుద్రవరం/ కోవెలకుంట్ల/ డోన్‌రూరల్/ ప్యాపిలి/ ఉయ్యాలవాడ/ దొర్నిపాడు / సంజామల / అవుకు/ కొలిమిగుండ్ల / బనగానపల్లె/ శిరివెళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మూడురోజుల పాటు భక్తులతో పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లారు. డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని చాగలమర్రి, రుద్రవరం, కోవెలకుంట్ల, డోన్, ప్యాపిలి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, శిరువెళ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో కొలువుదీరిన గణపయ్యలను శుక్రవారం నిమజ్జనం చేశారు. ముందుగా వినాయక మండపాలలోని విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భం గా వినాయక విగ్రహాలను బాజా భజంత్రీలు, యువకుల కేరింతలు, మహిళల కోలాటాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలతో గణేశుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. రంగులు చల్లుకుంటూ, జై బోలో గణేష్ మహరాజ్‌కి .. జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆయా గ్రామాల పరిధిలోని చెరువుల్లో, కుంటల్లో లంబోదరుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఉయ్యాలవాడలో..



బనగానపల్లె: నందవరంలో గణేశ్ నిమజ్జనం గావిస్తున్న భక్తులు



ప్యాపిలిలో..

కోటకొండ నిమజ్జనంలో స్వల్ప ఉద్రిక్తత

రుద్రవరం మండలంలోని కోటకొండ గ్రామంలో శుక్రవారం సాయంత్రం గణనాథుడి నిమజ్జనంలో ఇరువర్గాల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తుండగా మాటమాటా పెరిగి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ మహ్మద్ రఫీ గ్రామానికి చేరు కుని ఇరు వర్గాల వారి కి సర్ది చెప్పారు. అనంతరం గణనాథులను తెలుగు గంగ కాల్వలో ప్రశాంతంగా నిమజ్జనం చేశారు.



అవుకులో..



సంజామలలో..



ఆళ్లగడ్డలో..



చాగలమర్రి: ముత్యాలపాడులో వినాయక విగ్రహాల ఊరేగింపు



రుద్రవరం రంగారెడ్డి చెరువులోకి గణనాథులను తీసుకెళ్తున్న యువకులు



కొలిమిగుండ్లలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు



డోన్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



కొలిమిగుండ్లలో కోలాటం ఆడుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో వినాయకులకు పూజలు



బేతంచెర్లలో వినాయకుడిని దర్శించుకున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు పూజలు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నృత్య పోటీ లు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో పలు వినాయక మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో వినాయకచవితి పండుగ సందర్భంగా 24 మండపాల్లో కొలువుదీరిన వినాయకులకు శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆయా మండపాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాల అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన సర్వ గణేష్ విగ్రహానికి డోన్ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చాగలమర్రిలో వినాయకుడిని పూజిస్తున్న చిన్నారులు

- పట్టణంలో పైడిపేటలో ఏర్పాటు చేసిన శ్రీరామ గణేష్‌ను మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శాలువతో ఆయనున్న సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, చైర్మన్ చలంరెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, కార్యదర్శి సీతారామచంద్రుడు, నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి: మంత్రి బీసీ

బనగానపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను బీసీ స్వీకరించారు. అప్పటికప్పుడే కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్‌లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పట్టణంలోని అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ మహబూబ్‌బాషకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. క్యాంపు కార్యాలయంలో నగదును బాధితుడికి మంత్రి అందించారు.

వివిధ అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం నుంచి పట్టణంలో సుడిగాలి పర్యటనలు చేపట్టారు. పట్టణంలోని కొట్నాల వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణం పనులను స్వయంగా పరిశీలించారు. పాతమార్కెట్ సమీపంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులు మంత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో జరుగుతున్న డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.



క్యాంపు కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి బీసీ

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



ఉయ్యాలవాడలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థినులు

చాగలమర్రి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వంగలి ఉన్నత పాఠశాల, చాగలమర్రి బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బా, అజీమ్ బ్రిలియంట్ పాఠశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కస్తూర్బా పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయురాలు కోల జయలక్ష్మి, కస్తూర్బా పీఈటీ అలివేలిబాయిని, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సిద్దేశ్వరిని సన్మానించారు. హెచ్ఎంలు సుధాకర్‌గుప్త, జీవయ్య పీడీ శ్రీనా థ్‌రెడ్డి, అపాస్ సభ్యుడు లక్ష్మయ్య, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రవరం : రుద్రవరం ఆదర్శపాఠశాల, నరసాపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : మండల పరిధిలోని కలుగొట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సుధాకర్, రేవనూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ ఉపాధ్యాయురాలు శశికళను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటసుబ్బయ్య, హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు శివనాగయ్య, సువర్ణ, ఆంజనేయులు, ఖలీల్, కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆదర్శపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, రోహిణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

బేతంచెర్ల: తెలుగు బాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కొలిమిగుండ్ల : రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భాష ఎంతో మహోన్నతమైనదని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, తెలుగు పండితులు వైవీఎస్ నారాయణరెడ్డి, గురప్ప అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, మోడల్‌స్కూల్‌లో తెలుగు భాషా, క్రీడాదినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు బాబయ్య, నాగరాణిలను ఏపీయూఎస్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండప్ప, ఉపాధ్యాయులు కేవీ. రమణయ్య, బాస్కరరెడ్డి, రాముడు, శివశంకర్, ప్రియాంక, శిరీష, పాల్గొన్నారు.

సంజామల: సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట రమణా రెడ్డి, హెచ్ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, సరస్వతి శిశు మందిరంలో శుక్రవారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్

దోమల నియంత్రణకు చర్యలు

చాగలమర్రి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో దోమల నియంత్రణకు వైద్యసిబ్బంది చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వ ఉన్న కుంటలో శుక్రవారం టీడీపీ నాయకులు, సాగునీటి సంఘ చైర్మన్ జమాల్‌రెడ్డి, హెచ్ఈ మనోహర్, వైద్య సిబ్బంది 300 గంబుషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లీలావతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సబ్సిడీ పశుగ్రాస విత్తనాల పంపిణీ

ఆళ్లగడ్డ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కోట కందుకూరు గ్రామీణ పశువైద్యశాలలో జేవీవో దీపిక ఆధ్వర్యంలో సబ్సిడీ పశు గ్రాస విత్తనాలను పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. జేవీవో దీపక మాట్లాడుతూ పాడి రైతులు పశుగ్రాసం విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సురేష్‌బాబు

ఆళ్లగడ్డ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం అహోబిలంలోని పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చేసే పలు రకాల వైద్య పరీక్షల గురించి ఆరా తీశారు. వైద్యసిబ్బందితో కలిసి డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులకు దోమల వల్ల వచ్చే విష జ్వరాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వాతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ , సిబ్బంది జగదీశ్వరప్ప, రామారావు, అనిల్, యశోద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ

బనగానపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పీవీ. నాగార్జునరెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె మండలం నందవరం చౌడేశ్వరీమాత ఆలయా భివృద్ధికి శుక్రవారం పీఆర్ ఓబుళరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి పీఆర్. ప్రభావతి విరాళం ఇచ్చారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభావతి రూ. లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది, పీవీ.నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

బనగానపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జుర్రేరు వాగు సమీపంలో బీవీ ఫంక్షన్‌హాల్ ఆవరణంలో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని పోలీస్ బందోబస్తు మధ్య మైనర్ ఇరిగేషన్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ డీఈ నాగన్న, ఏఈ రామ్మోహన్‌రెడ్డి, బనగాపల్లె ఎస్ఐ కల్పన, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

బనగానపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి కోరారు. శుక్రవారం పలుకూరు యూపీఎస్, ఉర్దూ పాఠశాలలో 'మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి సహకారంతో విద్యార్థులకు రాత పుస్తకాలు బ్రహ్మానందాచారి , ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రహీం బేగ్, నాగేంద్రుడు, ఉపాధ్యాయుడు చంద్రమౌళి, రంగయ్య, మధు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.